





ఆవకాయ్.. హాయ్‌హాయ్..

పచ్చళ్ల సీజన్ మొదలైంది. సంగారెడ్డిలో పచ్చడి మామిడికాయల కొనుగోళ్లు జోరందుకున్నాయి. పట్టణంలోని ఫ్రైడే మార్కెట్‌లో మామిడి కాయలకు డిమాండ్ నెలకొంది. కాయలు కొన్నవారికి ముక్కలు చేసి ఇవ్వడం ద్వారా పలువురు ఉపాధి పొందుతున్నారు. కొనుగోలు, ముక్కలు కొట్టడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది.

-సంగారెడ్డి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి)

రాజీవ్‌గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం



సంగారెడ్డిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

రాజీవ్‌గాంధీ వర్ధంతిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అడుగుజాడల్లో నడవాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డిలోని రాజీవ్‌పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ హయాంలో తీసుకువచ్చిన సంస్కరణలు అన్నివర్గాల వారికి సత్ఫలితాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలతోనే సాంకేతికంగా దేశం అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్‌కుమార్, కిరణ్ గౌడ్, మహేశ్, కసిని రాజు, నాగరాజు, ఉదయ్‌భాస్కర్, తాహెర్‌పాషా, సునీల్, సోహెబ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ పార్కులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి తదితరులు

సీఎం సీటు ఇజ్జత్ తీస్తున్న రేవంత్‌రెడ్డి

- రైతులను మోసం చేస్తున్న సర్కారు
- రైతుబంధు, రైతుబీమా, బోనస్, ఇన్‌పుట్ సబ్సిడీలు ఎగ్గొట్టారు
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



జహీరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తుందని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల సరఫరా విషయంలో ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓవైపు విత్తనాలు, ఎరువుల కొరతను సృష్టించి, ఎరువుల ధరలను పెంచి రైతులపై భారం మోపారని ఆరోపించారు. నల్గొండ, వరంగల్, మెదక్, కామారెడ్డి తదితర జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతుల కల్లాల్లో, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయినా.. ప్రభుత్వం కొనుగోలు చేయలేని దుస్థితి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోలు తరుగు తీయడం దారుణమని ఆయన మండిపడ్డారు. పాలకులు, అధికారులు మొద్దునిద్రను వీడి కొనుగోళ్లలో వేగం పెంచాలన్నారు. రేవంత్ సర్కార్‌కు పెంచుడు తప్ప పంచుడు తెలియదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం గడప దాటడంలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుబంధు, రైతుబీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ, బోనస్ తదితర పథకాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యంకు సంబంధించిన డబ్బులు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ హయాంలో అందజేసిన సబ్సిడీలన్నింటినీ

మిగతా 8వ పేజీలో..



నిజాంపేట సబ్‌మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యం

అన్నదాత వరిగోస

అకాల వర్షాలతో అష్టకష్టాలు

వర్షాకాలం సమీపిస్తున్నా యాసంగి వడ్ల కొనుగోళ్లు లక్ష్యం చేరలేదు. ఆరుగాలం పండించిన పంటను అమ్ముకుందామంటే అన్నదాతకు అరిగోస తప్పడం లేదు. పంట పండించడం ఒక ఎత్తైతే.. కేంద్రాలకు తరలించి విక్రయించడం మరో ఎత్తవుతున్నది. మరోపక్క జాప్యానికి తోడు అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. పలుచోట్ల రెండు మూడు వారాలైనా వడ్లు తూకం వేయడం లేదు. టార్పాలిన్లు కప్పినా వడ్లు తడుస్తున్నాయి. అధికార యంత్రాంగం సమన్వయ లోపంతో రైతులు అగచాట్లు పడుతున్నారు.

- కొనుగోలు కేంద్రాల్లో సమస్యల తిష్ఠ.. కుప్పల వద్దే రైతుల పడిగాపులు
- లారీల జాప్యంతో ఆలస్యం.. వర్షానికి తడిసి మొలకలు వస్తున్న వడ్లు
- వర్షాకాలం సమీపించినా లక్ష్యం చేరని కొనుగోళ్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 21: సంగారెడ్డి జిల్లాలో 218, మెదక్ జిల్లాలో 498 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లాలో 120 కేంద్రాలను మూసివేశారు. యాసంగి సీజన్‌లో సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటివరకు 97,569 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మెదక్ జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

మిగతా 8వ పేజీలో..

ఇరవై రోజులుగా కేంద్రంలోనే వడ్లు

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి ఇరవై రోజులు గడుస్తున్నది. ఇప్పటికీ తూకం వేయలేదు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పినప్పటికీ ఫలితం ఉండట్లేదు. వర్షాలకు తడిసిన వడ్లు మొలకలు వస్తున్నాయి. ఇప్పటికే 16 టార్పాలిన్లు 20 రోజులుగా అద్దెకు తెచ్చాను. సొసైటీ నిర్వాహకులను అడిగితే లారీలు లేవని, హమాలీలు లేరని దాటవేస్తున్నారు.

-పాషా, ఉప్పులింగాపూర్, (వెల్దుర్తి)

వడ్లన్నీ తడిసిపోయాయి



కష్టపడి పండించిన వడ్లన్నీ తడిసిపోతున్నాయి. రెక్కల కష్టమంతా నీళ్లపాలవుతున్నది. కేంద్రానికి ధాన్యం తెచ్చి ఇరవై రోజులైనా కాంటా చేయలేదు. రేపుమాపు అంటూ దాటవేస్తున్నారు. రోజూ వర్షాలు పడటంతో వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి.

-ఋర్ర లక్ష్మి, నస్కల్ (నిజాంపేట)

అధికారులు పట్టించుకోవాలి



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ తూకం వేయలేదు. అకాల వర్షాలకు వడ్లన్నీ మొలకలొస్తున్నాయి. రోజూ వడ్లను ఎండకు పోయడం. సాయంత్రానికి వర్షంలో తడవటం నిత్యకృత్యంగా మారింది. ఇంకెన్నిరోజులు ఇక్కడ ఉండాలో తెలియడం లేదు.

-సత్యనారాయణ, ఫైజాబాద్ (చిలప్‌చెడ్)

మెదక్ జిల్లాలో భారీ వర్షాలు

మెదక్, మే 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక తీరానికి సమీపంలో ఉపరితల ఆవర్తనం, నైరుతీ రుతుపవనాల ప్రభావంతో గత రెండు రోజులుగా మెదక్ జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం నార్సింగి మండలంలో అత్యధికంగా 50.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మెదక్‌లో 46.4 మి.మీ., వెల్దుర్తిలో 33.3 మి.మీ., మాసాయిపేటలో 28.8 మి.మీ., చిన్నశంకరంపేటలో 38.6 మి.మీ., నిజాంపేటలో 34 మి.మీ.ల వర్షపాతం నమోదయ్యింది. మరో రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా ప్రణాళికా కార్యాలయం తెలిపింది. ఈ ఏడాది విచిత్ర వాతావరణం నెలకొంది. ప్రస్తుతం రోహిణి కార్తె ప్రారంభం కాకముందే వర్షాలు ప్రారంభమయ్యాయి. గత కొద్ది రోజులుగా వాతావరణంలో ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లిలో 36.9 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది.

- కొల్చారం, చిన్నశంకరంపేట, చేగుంట, తూప్రాన్, వెల్దుర్తి మండలాల్లో గాలివానకు కేంద్రాల వద్ద వడ్లు తడిసిపోయాయి.
- తూప్రాన్ పట్టణం రావెల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి నీరు చేరడంతో ధాన్యం కుప్పలు నీటితో నిండిపోయాయి.
- మనోహరాబాద్ మండలం దండుపల్లి, పోతారం, పర్కిబండ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పూర్తిగా తడిసింది. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కేంద్రాలను పరిశీలించారు. హైవే 44పై రామాయపల్లి వద్ద ఉన్న రైల్వేబ్రిడ్జి అండర్‌పాస్‌లో నీరు నిలవడంతో తహసీల్దార్ పరిశీలించి నిర్మాణం పూర్తయిన ఒకవరుస వంతెన మీదుగా.. రెండు వైపుల వాహనాలను పంపించారు.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో బుధవారం పలుచోట్ల వర్షం కురిసింది. ఝరాసంగం మండలంలో వానాకాలాన్ని తలపించేలా భారీ వర్షం కురియడంతో ప్యాలవరం వాగు భారీ పొంగిపొర్లింది. పొలాలకు కూలీలు వాగు దాటేందుకు ఇబ్బందులుపడ్డారు.

- నారాయణఖేడ్ మండలంలో ఉరుములు మెరుపులతో గాలివాన కురిసింది. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. మామిడి కాయలు రాలిపోయాయి.

కాలనీకో పోలింగ్‌బూత్

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- పోలింగ్‌బూత్‌ల వారీగా మ్యాపింగ్



రామచంద్రాపురం టౌన్ మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటేయాలంటే ఓటర్లు నానాఅగచాట్లు పడాల్సి వస్తున్నది. కుటుంబంలో ఒక్కొక్కరి ఓటు ఒక్కో బూత్‌లో ఉండటం, ఆయా బూత్‌లు ఎక్కడో దూరాన ఉండటంతో అటూ ఇటు తిరగాల్సి వస్తున్నది. కొన్నిసార్లు విసిగిపోయి ఓటు వేయకుండానే వెనుదిరగడం కనిపిస్తుంటుంది. దీని ప్రభావం ఓటింగ్ శాతంపై పడుతున్నది. ఓటర్లకు వ్యయప్రయాసలు నివారించడానికి ఎన్నికల సంఘం కొత్త విధానాన్ని అనుసరించడానికి సిద్ధమవుతున్నది.

దూరం కారాదు భారం

ఓటరులో ఓటు వేయాలన్న ఆసక్తి పెంచాలని, దూరం అనేది భారం కాకుండా సరదాగా ఓటు వేసి వద్దాం అన్న భావన కలిగించే పద్ధతులు అనుసరించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలను కలుపుతూ ఉన్న జీహెచ్ఎంసీ ప్రాంతాన్ని యూనిట్‌గా చేసుకొని ప్రయోగాత్మక ప్రాజెక్టుగా నిర్వహించనున్నారు. ఈసీఐఎల్ పరిశ్రమ సాంకేతిక సహకారంతో కాలనీల వారిగా బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. ముందుగా కాలనీల వారిగా మ్యాపింగ్ చేసే క్రమాన్ని ప్రారంభించనున్నారు. సర్వేయర్లు పోలింగ్‌కేంద్రం యూనిట్‌గా మ్యాప్‌లు గీయాల్సి ఉంటుంది. నగరంలో ప్రతీ కాలనీకో మ్యాప్ ఉంది. అదే తరహాలో నగర శివారు ప్రాంతాల్లోని కాలనీలను మ్యాపింగ్ చేయనున్నారు. జీహెచ్ఎంసీలోని కాలనీల మ్యాప్‌లతో శివారు ప్రాంతాల్లోని కాలనీల్లోని మ్యాప్‌లపై సూపర్‌ఇంపోజ్ చేసుకొని పోలింగ్‌బూత్ యూనిట్‌గా నూతన మ్యాప్‌లు తయారు చేయనున్నారు. దీనిపై నాలుగు జిల్లాల ఎన్నికల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

1500 మంది ఓటర్లకో బూత్

ఒకే కాలనీలో 1500 మంది ఓటర్లు ఉంటే వారి కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్నా.. చిరునామా మార్చి ఎపిక్ నంబరును అలానే ఉంచుతారు. ఓటర్ల సంఖ్య అంతకంటే ఎక్కువ ఉంటే పక్కనే మరో బూత్‌ను ఏర్పాటు చేస్తారు. రానున్న రోజుల్లో బూత్ నంబరు చెపితే చాలు ఇల్లు ఎక్కడో చెప్పగలిగేలా మ్యాప్‌లు గీస్తున్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఈసీఐఎల్ సంస్థతో సాంకేతిక పరమైన అంశాలపై అవగాహన చేసుకున్నారు.

ట్రాన్స్‌కోలో అవినీతి బాగోతంపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

సంగారెడ్డి టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి విద్యుత్‌శాఖలో జరిగిన అవినీతిపై విచారణ కొనసాగుతున్నది. డీపీఈ (డివిజనల్ పిల్ ఫైప్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంజనీరింగ్) విభాగాలకు చెందిన అధికారులు సంయుక్తంగా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. 'ట్రాన్స్‌కోలో అవినీతి బాగోతం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 15వ తేదీన ప్రచురితమైన కథనంపై విజిలెన్స్ డీపీఈ అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. పటాన్‌చెరులోని వెంచర్‌కు మంజూరైన 10 కోట్ కిలోమీటర్ల కండక్టర్ వైరును కొంతమంది ట్రాన్స్‌కో అధికారులు దొంగచాటుగా అమ్మేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. సంగారెడ్డిలోని స్టోర్‌రూమ్ నుంచి తరలించిన వాహనం వివరాలు, వర్క్‌ఆర్డర్, సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించినట్టు సమాచారం. పటాన్చెరులోని వెంచర్‌కు కండక్టర్ వైరు తరలించారా లేదా అనే కోణంలో విచారిస్తున్న అధికారులు వెంచర్‌ను కూడా సందర్శించినట్లు తెలిసింది. పటాన్‌చెరులోని సదరు వెంచర్ ఓ మంత్రి దగ్గర బంధుకు చెందినది కావడంతో అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం.



లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాలి

సంగారెడ్డి జిల్లా కోర్టు మూడో అదనపు న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి

7లో



రన్నరప్‌గా నిలిచిన మెదక్ జట్టు

సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత నిజామాబాద్

రన్నరప్‌గా నిలిచిన మెదక్ జిల్లా జట్టు

7లో

ప్రజల ఫీడ్‌బ్యాక్‌లో మెదక్ జిల్లా ఫస్ట్

డీజీపీ నుంచి సర్టిఫికెట్ అందుకున్న అదనపు ఎస్పీ మహేందర్



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మెదక్ అదనపు ఎస్పీ మహేందర్



అవార్డును అందుకుంటున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ సేవల్లో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలిచి అవార్డు దక్కించుకుంది. డీజీపీ జితేందర్ చేతులమీదుగా అదనపు ఎస్పీ మహేందర్ బుధవారం ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పనితీరులో పోలీసులపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ప్రతీ స్టేషన్‌లో ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచారు. ప్రజల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పనితీరుపై ర్యాంకులను ప్రకటించారు. జనవరి 9 నుంచి ఇప్పటివరకు ప్రజలు ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌లో మెదక్ జిల్లాకు రాష్ట్రంలోనే ఫస్ట్‌ర్యాంకు లభించింది. ప్రథమస్థానానికి జిల్లా ఎంపిక కావడం అభినందనీయమని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

నర్సాపూర్-1, తూప్రాన్-4

సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో రాష్ట్రంలోనే 10 ఉత్తమ పోలీస్‌స్టేషన్లలో మెదక్ జిల్లాకు చెందిన రెండు స్టేషన్లకు చోటుదక్కింది. ప్రథమస్థానంలో నర్సాపూర్ స్టేషన్, నాలుగో స్థానంలో తూప్రాన్ స్టేషన్ నిలిచాయి. ఆయా స్టేషన్ల ఎస్ఐలు లింగం, శివానందం డీజీపీ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. పోక్సో కేసుల్లో 60 రోజుల్లో అత్యధికంగా 10 చార్జ్‌షీట్లు దాఖాలు చేసినందుకు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచారు. ఈమేరకు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

కేసుల విచారణలో సంగారెడ్డి జిల్లాకు..

సంగారెడ్డి క్రైం : కేసుల చేదనలో రాష్ట్రస్థాయిలో సంగారెడ్డి జిల్లాకు గుర్తింపు లభించింది. రాష్ట్రవ్యాప్తంగా అతి తక్కువ సమయంలో ఎక్కువ కేసులను చేదించి, నిందితులకు మరణ శిక్ష పడేలా చేసిన బొల్లారం ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రఫీక్, సీత్య నాయక్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో బెస్ట్ కన్విక్షన్ అవార్డు అందుకున్నారు. వారం రోజుల వ్యవధిలోనే రూ. 3 కోట్ల విలువైన ఆస్తి సంబంధిత నేరాన్ని చేదించి జహీరాబాద్ ఇన్‌స్పెక్టర్ శివలింగం రాష్ట్రస్థాయిలో గుర్తింపుపొందారు. వారు బుధవారం ప్రశంసాపత్రాలను అందుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వారిని అభినందించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు

● రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

జిన్నారం, మే 21, (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. గడ్డపోతారం 79 సర్వే నెంబర్ ప్రభుత్వ భూముల నుంచి రాత్రి వేళ అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారమందింది. ఈ మేరకు బుధవారం తెల్లవారు జామున అధికారులు దాడులు నిర్వహించి మట్టిని తరలిస్తున్న 2 టిప్పర్లు, 2 ఎక్స్‌కవేటర్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి యజమానులు, డ్రైవర్ల పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో.. 26 మందికి గాయాలు

మెదక్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 26 మందికి గాయాలయ్యాయి. శివ్వంపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 3 వాహనాలు ధ్వంసం కాగా 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. తూప్రాన్ మండలంలో 8 మంది, రామాయంపేటలో 10 మందికి గాయాలయ్యాయి. బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనల్లో 20 మంది తీవ్ర గాయాలు కాగా, ఆరుగురు స్వల్పగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

- శివ్వంపేట/తూప్రాన్/ రామాయంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి)


శివ్వంపేట: డీసీఎం ఢీకొని నుజ్జునుజ్జయిన టవేరా వాహనం


రామాయంపేట హైవేపై ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ


తూప్రాన్: యావాపూర్ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన బాధితులు

శివ్వంపేట మండలంలో..

శివ్వంపేట మండలంలో టవేరా వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన డీసీఎం బలంగా కొనడంతో లారీ కిందికి టవేరా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన బూర్గారి విఠల్‌కు చెందిన టవేరా వాహనంలో మంగళవారం రాత్రి డ్రైవర్ శ్రీనివాస్ మండల పరిధిలో గోమారం గ్రామానికి శుభకార్యానికి వచ్చి కౌడిపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో చిన్న గొట్టిముక్ల బాయన్న చెరువు సమీపంలో నర్సాపూర్ వైపు నుంచి ఎదురుగా లారీలు వస్తుండడంతో నర్సాపూర్ వైపునకు వెళ్తున్న లారీ డ్రైవర్ రోడ్డు పక్కన లారీని ఆపుకొని ఉన్నాడు. కాగా ఆపి ఉన్న లారీ వెనుక వైపు నుంచి వస్తున్న టవేరా వాహనాన్ని ఆ వెనుకే వస్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో టవేరా లారీ కింద దూసుకొవెల్లి నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్నకౌడిపల్లిమండలంలోని ముండ్రా యి, వెల్మకన్న, తునికి, చిప్పలతుర్తి గ్రామాలకు చెందిన 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ధ్వంసమైన డీసీఎం టవేరా వాహనాలను బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్ తీసుకురాగా, లారీని నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తూప్రాన్‌లో..

బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఓవర్ టేక్ చేసే యత్నంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటనలో 8మందికి గాయాలయ్యాయి. తూప్రాన్ మండలం యావాపూర్ శివారులో రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకున్నది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. తూప్రాన్‌లో నివాసముండే తాపీ మేస్త్రీలు పరిశపోగు రమేష్, కల్లు శివ, లింగాల మరియదాస్, పరిశపోగు ప్రవీణ్, కల్లు సురేష్‌లు కారులో తూప్రాన్ నుంచి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంతగిరిపల్లి గ్రామానికి పనులు చేసేందుకు బయలుదేరారు. అదే సమయంలో సిద్దిపేట నుంచి బొలెరో వాహనంలో చింతమడక గ్రామానికి చెందిన కాముని సత్యనారాయణ, యశ్వంత్, కెత్వాన్‌లు తూప్రాన్ వైపు వస్తున్నారు. అదే రోడ్డుపై గుంటూరు జిల్లాకు చెందిన కుంభ శంకర్ (50) మోపెడ్ వాహనంపై ప్రయాణిస్తుండగా బొలెరో వాహనం మోపెడ్‌ను ఓవర్‌టేక్ చేసే యత్నంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో రమేష్, శివ, ప్రవీణ్, సురేష్, శంకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బొలెరోలో వెళ్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

రామాయంపేటలో..

రామాయంపేట హైవే, సిద్దిపేట రోడ్డులో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పదిమంది గాయపడ్డారు. బుధవారం రెండు చోట్ల ఈ ఘటనలు జరిగాయి. మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రామాయంపేటకు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. అలాగే సిద్దిపేట చౌరస్తాలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఏడుగురు ఆటో ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీల కోసం రోడ్డెక్కిన అన్నదాత

● మెదక్- సంగారెడ్డి రహదారిపై గంటపాటు ధర్నా


రంగంపేటలో రైతులను సముదాయిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

కొల్చారం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం పండించిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. బుధవారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై పైతర గ్రామ రైతులు పెద్ద ఎత్తున వచ్చి దాదాపు గంటపాటు ధర్నా, రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. వారం రోజుల నుంచి పది లారీలు ధాన్యం నింపి నిలువ ఉంచామన్నారు. లారీలు రాకపోవడంతో ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి వెంటనే ఘటనాస్థలానికి వచ్చి రైతులను సముదాయించారు. ప్రస్తుతం రెండు లారీలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించాలి: సునీతాలక్ష్మారెడ్డి

లారీల కొరత లేకుండా వెంటనే రైతుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు పంపించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ శివ్వంపేట్, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో లారీల కొరత ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నింపిన బస్తాలు అలాగే ఉన్నాయన్నారు. జిల్లా అధికారి డీఎం డీఎస్‌వోతో మాట్లాడానని, వెంటనే ధాన్యాన్ని తరలించాలని రైతుల పక్షాన మాట్లాడినట్లు తెలిపారు.

వర్షంలో బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


జగదీశ్(ఫైల్)

నంగునూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వర్షంలో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని ముండ్రాయి గ్రామశివారు సురభి ఆస్పత్రి వద్ద చోటు చేసుకున్నది. మండలంలోని రాజగోపాలపేటకు చెందిన కొక్కొండ జగదీష్(24) అనే యువకుడు సిద్దిపేట నుంచి రాజగోపాల్ పేటకు వర్షంలో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్ స్వగ్రామమైన ఎర్రవల్లి మల్లన్నసాగర్‌లో మునిగిపోవడంతో కొంతకాలంగా రాజగోపాలపేటలోని అమ్మమ్మ ఇంటిదగ్గర తల్లి భాగ్యవ్వ, తమ్ముడు మధు తో కలిసి ఉంటున్నారు. సిద్దిపేటలోని ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పని ముగించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

భవనంపై నుంచి పడి.. చికిత్స పొందుతూ..


గొల్ల స్వామి(ఫైల్)

తూప్రాన్, మే 21(ఆంధ్రజ్యోతి): భవనం దాబాపై పడుకున్న వ్యక్తి ఫిట్స్‌తో కింద పడి తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన బుధవారం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన నర్ర గొల్లస్వామి (45) కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 16న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భవనం దాబాపై పడుకున్నారు. రాత్రి నిద్ర నుంచి లేచి మూత్ర విసర్జనకు వెళ్లే సమయంలో ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన గొల్లస్వామిని చికిత్స కోసం తూప్రాన్ ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆపరేషన్ కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంజీరాలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొల్చారం, మే 21 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారు మొదటి బ్రిడ్జి వద్ద మంజీరాలో చోటు చేసుకున్నది. జాలర్లు బుధవారం ఉదయం చేపలు పట్టడానికి వెళ్లగా మృతదేహం కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు జీన్ ప్యాంటు ఉంది.

నిందితుల ఫొటోలు విడుదల

మెదక్అర్బన్, మే21(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల ఫొటోలను పట్టణ పోలీసులు బుధవారం విడుదల చేశారు. సదరు వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే.. 8712657913, 8712657878 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ నాగరాజు కోరారు.


పోలీసులు విడుదల చేసిన నిందితుల ఫొటోలు

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


కృష్ణ మృత దేహం

కౌడిపల్లి, మే (ఆంధ్రజ్యోతి) 21: అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తి చెరువుల దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని సదాశివపల్లిలో మంగళవారం జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి కృష్ణ(34) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది తన కుటుంబీకులతో ఆరోగ్య సమస్యలపై తరచూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణ తిరిగిరాలేదు. అదే రోజులు కుటుంబీలు గాలించగా కనికల చెరువుకట్టపై దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో చెరువులో పడిఉంటాడని భావించి గాలించినా ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం నర్సాపూర్ నుంచి రెస్క్యూ టీం కౌడిపల్లి పోలీసుల సహకారంతో చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య శోభతో పాటు కూతుళ్ల అనుప్రియ, విష్ణుప్రియ ఉన్నారు.

కోమటి కుంటలో చేపలు మృత్యువాత

నర్సాపూర్, మే 21(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రోడ్డు సమీపంలో పట్టణానికి అతి సమీపంలో ఉన్న కోమటికుంటలో చేపలు పెద్ద మొత్తంలో చనిపోయాయి. బుధవారం చేపలు పట్టడానికి వచ్చిన మత్స్యకారులకు పెద్దసంఖ్యలో చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వచ్చిన దృశ్యం కనిపించడంతో హతాశులయ్యారు. కోమటి కుంటలోకి సమీపంలోని ఇళ్ల నుంచి పెద్దఎత్తున డ్రైనేజీ నీరు రావడంవల్లే నీరు కలుషితమై సుమారు 10 క్వింటాళ్ల చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.


కోమటికుంటలో చనిపోయిన చేపలు

మార్డి పెద్దచెరువు భూముల సర్వే

కల్హేర్, మే 21(ఆంధ్రజ్యోతి) : మండల పరిధి మార్డి గ్రామంలోని పెద్దచెరువు భూముల సర్వేను బుధవారం కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టారు. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరువు భూమిని కబ్జాకు యత్నించగా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కబ్జాకు గురైన భూమితో పాటు చెరువుపై భాగంలో ఉన్న భూముల్లోనూ సర్వే నిర్వహించారు. మ్యాప్ ప్రకారం చెరువు హద్దులను గుర్తిస్తామని, నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారిస్తారని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సర్వేలో రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేసిన భూమితో పాటు చుట్టూ ఉన్న సుమారు 45 ఎకరాల చెరువు భూములను కబ్జాకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. హద్దులు ఏర్పాటు చేసిన అనంతరం కబ్జాకు పాల్పడిన వారందరికీ నోటీసులు అందజేసి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఈ సర్వే పనుల్లో సర్వేయర్ ప్రభాకర్, సహాయకులు శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది రవి, ఎల్లయ్య, నాయకులు ఎన్నం సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాలి

● సంగారెడ్డి జిల్లా కోర్టు మూడో అదనపు న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి

సంగారెడ్డి క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా కోర్టు మూడో అదనపు న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి కోరారు. జిల్లా కోర్టులో బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్స్ అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఇందులో మోటార్ వెహికిల్ ప్రమాద కేసులు, బ్యాంకు మొండి బాకియిలు, చిట్‌ఫండ్ ఇపి కేసులు రాజీ పడే అన్ని కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డీవీఆర్ తేజో కార్తీక్, బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్స్ అధికారులు పాల్గొన్నారు.

నక్కల(పిట్టల) వారిని ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించడంతో ఎనిమిదేళ్ల పోరాటం ఫలించింది. రాష్ట్రంలో ఉన్న 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. సిద్దిపేట జిల్లాలో తొగుట మండలం ఎక్కువగా ఉన్న నక్కల కులస్థులు ఈ నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్న ముత్యంపేట(పిట్టలవాడ)కు చెందిన నక్కల కులస్థులు బుధవారం ఎస్టీ సర్టిఫికెట్‌ను సైతం పొందారు.


చిన్నముత్యంపేటలోని నక్కల కులస్థులతో సమావేశమైన తొగుట తహసీల్దార్ శ్రీకాంత్

పోరాటం ఫలించే

ఎస్టీ జాబితాలోకి నక్కల కులస్థులు


ఎస్టీ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న నక్కల కులస్థులు

- సామాజిక సమరసత వేదిక నేతృత్వంలో ఎనిమిదేళ్లుగా ఉద్యమం
- రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కుటుంబాలకు లబ్ధి
- సిద్దిపేట జిల్లాలో 600 కుటుంబాలు
- చిన్నముత్యంపేట గ్రామస్థులకు సర్టిఫికెట్ అందజేత

తొగుట, మే 21 (ఆంధ్రజ్యోతి) : పోరాటం ఫలించింది. నక్కల (పిట్టల) వారిని ఎస్టీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో ఉన్న 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. సిద్దిపేట జిల్లాలో తొగుట మండలం ఎక్కువగా ఉన్న నక్కల కులస్థులు ఈ నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్నముత్యంపేట(పిట్టలవాడ) నక్కల కులస్థులు బుధవారం ఎస్టీ సర్టిఫికెట్‌ను సైతం పొందారు.

సామాజిక సమరసత వేదిక నేతృత్వం

సిద్దిపేట జిల్లాలో ముత్యంపేటతో పాటు దమ్మక్కపల్లి, నర్సాయిపల్లి, మందపల్లి, రాఘవాపూర్, దుబ్బాక, ధర్మారం, బస్వాపూర్, సలాక్‌పూర్, చిట్టాపూర్ తదితర 12 గ్రామాల్లో 600 వరకు నక్కలజాతి కులస్థులు ఉన్నారు. చిన్నముత్యంపేట గ్రామంలోనే సుమారు 80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. నక్కల కులస్థులు పిట్టలు పట్టుకుంటూ బతుకులు వెళ్లదీస్తుండటంతో పాటు 95 శాతం మంది నిరక్షరాస్యులు. కాగా వారికి ఎలాంటి కుల సర్టిఫికెట్ లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక, వెనుకబాటుకు లోనయ్యారు. వారిలో మార్పును తీసుకురావడానికి సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అప్పాల ప్రసాద్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. విద్య, వైద్యం అందేలా స్వచ్ఛంద సంస్థల సహకారంతో చేయూతనందించే కార్యక్రమాలు చేపట్టారు. సామాజికంగా వారిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. నక్కల జాతి కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని సామాజిక సమరసత వేదిక నేతృత్వంలో ఉద్యమ బావుటాను ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కులస్థులను ఏకం చేసి ఎనిమిదేళ్లుగా పోరాడుతున్నారు. పిట్టలవారు ఉన్న ప్రాంతంలోని రెవెన్యూ అధికారులకు ఎన్నో వినతి పత్రాలను అందజేశారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దృష్టికి తీసుకెళ్లి చివరికి సఫలీకృతమయ్యారు. నేటికి వారి స్వప్నం నెరవేరింది. ఇన్నాళ్ల పోరాటానికి ఫలితం దక్కింది.

ఎనిమిదేళ్ల పోరాట ఫలితం



నక్కల కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం. సామాజిక సమరసత వేదిక ఎనిమిదేళ్ల పోరాటానికి ఫలితం దక్కింది. విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో నక్కల కులస్థులకు న్యాయం జరుగుతుంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కృషి మరువలేనిది.

- అప్పాల ప్రసాద్, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్

ప్రభుత్వ నిర్ణయంతో వెలుగులు



ప్రభుత్వ నిర్ణయంతో మా నక్కల కులస్థుల జీవితాల్లో వెలుగులు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పిట్టల కులస్థులందరికీ ఎస్టీ సర్టిఫికెట్లు అందేలా కృషి చేస్తాం. సామాజిక సమరసత వేదిక కృషి వల్లనే ఇది సాధ్యమైంది.

- యాదగిరి, నక్కల కులస్థుల రాష్ట్ర సంక్షేమ సంఘం కన్వీనర్

ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వడం సంతోషకరం



చాలా ఏళ్లుగా కులం సర్టిఫికెట్ లేక ఇబ్బందులు పడ్డాం. అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఒకసారి 2005లో అధికారులు ఎస్టీ సర్టిఫికెట్ మంజూరీ చేసి మళ్లీ రద్దు చేశారు. ఇన్నాళ్లకు ప్రభుత్వం ఎస్టీ సర్టిఫికెట్‌లు మంజూరీ చేయడం సంతోషంగా ఉంది.

- తుమ్మల రాజు, చిన్నముత్యంపేట,

ఎస్టీ సర్టిఫికెట్‌లు మంజూరు

తొగుట మండలం చిన్నముత్యంపేట నక్కల కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఎస్టీ సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నాం. సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాలను పొందాలి.

- శ్రీకాంత్, తొగుట తహసీల్దార్



విజేతగా నిలిచి కప్‌ను అందుకుంటున్న నిజామాబాద్ జట్టు

సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత నిజామాబాద్

రన్నరప్‌గా నిలిచిన మెదక్ జిల్లా జట్టు


రన్నరప్ కప్‌ను అందుకుంటున్న మెదక్ జట్టు

తూప్రాన్, మే 21(ఆంధ్రజ్యోతి) : 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో 19న ప్రారంభమైన క్రీడా పోటీలు, బుధవారంతో ముగించారు. ఫైనల్ పోటీల్లో మెదక్, నిజామాబాద్ జిల్లా జట్టు పోటీ పడగా నిజామాబాద్ జట్టు 6-1 స్కోర్ తేడాతో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. మెదక్ జిల్లా జట్టు రజత పతకం, హన్మకొండ జట్టు కాంస్య పతకం దక్కించుకుంది. తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ పిచర్‌గా చందు (నిజామాబాద్), ఉత్తమ క్యాచర్‌గా సుమన్ (మెదక్), ఉత్తమ బ్యాటర్‌గా పావన్ (హన్మకొండ), ఉత్తమ ఆల్‌రౌండర్‌గా తరుణ్ (మెదక్) అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్, కోశాధికారి రేణుక, జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు కొత్త మార్గదర్శకాలు

● గత నెలలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కార్యదర్శులకు అవగాహన



దుబ్బాక, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పాలన వ్యవహారాల్లో మార్పులను తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. విధులు, నిర్వహణ, సేవలను ప్రస్తావిస్తూ సర్క్యులర్ మెమో నంబర్ సీపీఆర్‌ఆర్‌ఈడీ 4/జీపీఏడీ/ఎస్‌ఏఎన్/8/2025 డీ సెక్షన్‌ను విడుదల చేశారు. గ్రామాల్లో పచ్చదనం, పారిశుధ్యం, చెత్తసేకరణ, తాగునీటి నిర్వహణ, పౌరసేవలు, ఇతర విభాగాల పర్యవేక్షణ గురించి మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సర్క్యులర్ అందింది. అయితే, గత నెలలోనే పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఇందులోని అంశాలపై అవగాహన కల్పించారు.

నూతన మార్గదర్శకాలలో చెత్త సేకరణ, ఎరువుల తయారీతో పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవడానికి ప్రాధాన్యం కల్పించారు. దీని కోసం జోన్‌ల వారీగా విభజించి ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను, దుకాణాలు, మార్కెట్ల నుంచి వ్యర్థాలను సేకరించాలని తెలిపారు. డంప్‌యార్డులను పునరుద్ధరించి, సేంద్రియ ఎరువుల తయారీని చేపట్టాలని, ఇందులో సుమారు 24 అంశాలను ప్రతిపాదించారు. ఇక తాగునీటి నిర్వహణను మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో చేపట్టాలని సూచించారు. తాగునీటి క్లోరినేషన్‌తోపాటు, పరీక్షలు నిర్వహించాలని, ఎంపీవో, డీపీవో, డీఎల్‌పీవో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. ఎంపీవో మూడు నెలల్లో అన్ని గ్రామపంచాయతీలను, డీపీవోలు నెలలో తప్పనిసరిగా ఐదు పంచాయతీల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక యాప్ ద్వారా అధికారులను సమన్వయపరుస్తూ పంచాయతీల పాలనపై పర్యవేక్షణ కొనసాగుతుందని మార్గదర్శకాలల్లో తెలిపారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

● ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్

సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటిఐ) డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఈనెల 27వ తేదీలోగా సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డుల జీరాక్స్ ప్రతులు, నాలుగు ఫొటోలు, బ్యాంకు ఖాతా వివరాలను జత చేయాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 26వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సెల్‌ఫోన్ రిపేర్ టూల్ కిట్ ఇవ్వనున్నామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెదక్ అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఈనెల 24న జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మెదక్ స్టేడియంలో అండర్-8, 10, 12 బాలబాలికలకు రన్స్, త్రో జేమ్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల జూన్ 1న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. మిగితా వివరాలకు 9963005540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

జహీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రేపు జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో రాంరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు, తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీవో

అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలో 23న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో గురువారం వరకు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. హెలిప్యాడ్, సభాస్థలి ఏర్పాట్లు, హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వేదిక వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, స్టేజీ అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ తాగునీరు, మరుగుదొడ్లు, సభకు హాజరయ్యే ప్రజలకు సౌకర్యాలు అన్ని పనులను నేటి వరకు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లిలో బుధవారం మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో గవ్వలపల్లి చౌరస్తా నుంచి గజగట్లపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

- చిన్నశంకరంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి)

ప్రదక్షిణంతో పవనసుతుడి కటాక్షం

భక్తుల కోర్కెలు తీర్చే మల్లెంచెరువు కట్ట కింది వీరహనుమాన్

మెదక్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న క్షేత్రం మెదక్ పట్టణంలోని మల్లెంచెరువు కట్ట కింది వీరహనుమాన్ ఆలయం. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఒకొక్క ఆలయం ఒకొక్క విశిష్టతను కలిగి ఉంటుంది. ఇక్కడ ప్రదక్షిణలు చేసి మనసులోని కోరికను పవనసుతుడికి నివేదిస్తే తప్పకుండా నెరవేరుతుందని భక్తుల నమ్మకం. నిత్యం వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. మంగళ, శనివారాల్లో ప్రత్యేక పూజలతో ఆలయం విరాజిల్లుతోంది.

1964 సంవత్సరంలో బెంగళూర్‌కు చెందిన రామయ్య పంతులు ఇక్కడి వచ్చి, స్వామి వారిని ప్రతిష్ఠించి నిత్యపూజలను జరిపిస్తున్నారు. ఆయన తదనంతరం వారి వారసులే స్వామి వారి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.


మెదక్‌లోని మల్లెంచెరువు కట్ట కింది వీరహనుమాన్ ఆలయం


వీర హనుమాన్‌స్వామి

వీరహనుమాన్ ఆలయంలో గణపతి, సూర్యదేవుడు, శివపార్వతులు, సత్యనారాయణ స్వామి, నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో ఏళ్లనాటి రాగి చెట్టు, నవగ్రహాలు ఉన్నాయి. ప్రతీ పండుగను ఈ ఆలయంలో అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. నేటి హనుమాన్ జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నమ్మకంతో భక్తుల ధార్మిక ఆచరణ

ఇక్కడ భక్తులు విశేషంగా ఆచరించే ధార్మిక విధి ప్రదక్షిణలు చేయడం. వివాహం కానివారు, వైవాహిక బంధంలో ఇబ్బందులు ఉన్నవారు, ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టాలు, ఉద్యోగంలో ఉన్నతి లేనేవారు.. ఇలా అనేక ఈతిబాధలు ఉండి ఏ పని చేసినా కలిసిరాని వారు స్వామిని దర్శించి, కోరికను విన్నవించి ప్రదక్షిణలు చేస్తారు. 41 రోజుల పాటు నిత్యం చేసేవారు కొందరైతే, అర్చకుల సూచన మేరకు 7 మంగళవారాలు ప్రదక్షిణలు చేసే వారు మరికొందరు. కోరిక తీరిన తర్వాత 108 ప్రదక్షిణలు చేయడం ఇక్కడి భక్తుల నమ్మకం.

భక్తుల కొంగుబంగారం వీరహనుమాన్‌స్వామి



వీర హనుమాన్ స్వామిని దర్శించుకుంటే కోరిక కోర్కెలు తీరుతాయి. ఆలయంలో నిర్వహించే నిత్య హారతులు, అభిషేకాలు చేస్తూ.. ఆధ్యాత్మికతతో స్వామి వారి సన్నిధి విరాజిల్లుతోంది. నిత్య ప్రదక్షిణలు చేసే వారి కోరిన కోర్కెలు తీర్చే స్వామి భక్తుల పాలిట కొంగు బంగారం. హనుమన్ జయంతి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రతి ఏటా వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం.

- కొత్తకోట ప్రసాద్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

బోధనలో సాంకేతికతను జోడించాలి

● ఉపాధ్యాయ శిక్షణ శిబిరాల రాష్ట్ర పరిశీలకుడు భాస్కర్ దేశ్


మాట్లాడుతున్న భాస్కర్‌దేశ్

మెదక్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు బోధనకు అత్యాధునిక సాంకేతికతను జోడించాలని రాష్ట్ర పరిశీలకులు భాస్కర్ దేశ్ సూచించారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సాంకేతిక పద్ధతులను బోధనలో వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజిరెడ్డి, కోర్సు కోఆర్డినేటర్, హెచ్‌ఎం రేఖ, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత

నర్సాపూర్, మే 21(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిప్పల్‌తుర్తిలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోయిన రైతులు వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చని సూచించారు. న్యాయ సహాయం కోసం స్థానిక మండల లీగల్ సర్వీస్ కమిటీని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజు, వ్యవసాయ ఏఈవో తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకంతో లాభం

● వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ హేమలత



మాట్లాడుతున్న శాస్త్రవేత్త హేమలత

గుమ్మడిదల, మే 21 (ఆంధ్రజ్యోతి) : పంట సాగులో యూరియా బదులుగా కాంప్లెక్స్ ఎరువులు వాడడం లాభదాయకమని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ హేమలత పేర్కొన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతారం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత, టమోటాలో వచ్చే సాధారణ వ్యాధులు, నర్సరీ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ జానకి శ్రీనాథ్ పౌష్టికాహార అంశాలను వివరించారు. అనంతరం పటాన్‌చెరు డివిజన్ ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ప్రణవి, శాస్త్రవేత్తలు డాక్టర్ శివాని, డాక్టర్ స్రవంతి, ఏఈవో నిఖిత, విద్యార్థులు సుస్మిత, హిమాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి'

నారాయణఖేడ్, మే 21(ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని స్థానిక ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో ఖచ్చితంగా బిల్లు తీసుకోవాలన్నారు. బీటీ-3 పత్తి విత్తనాల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గడ్డి మందుకు తట్టుకునే విత్తనాలంటూ విక్రయిస్తున్నారని, అలాంటి వారి గురించి సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు ఒకేరకమైన విత్తనాలను కొనుగోలు చేయడం కోసం పోటీపడాల్సిన అవసరం లేదని, ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మునిపల్లి, మే21 (ఆంధ్రజ్యోతి) : పత్తి విత్తనాల ప్యాకెట్ల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అనితారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగిన డీలర్లతోనే విత్తనాలను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ అధికారి శ్రీనివాస్

నారాయణఖేడ్, మే 21(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం శానిటేషన్ అధికారి శ్రీనివాస్ తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా తడి, పొడి చెత్తలను వేర్వేరు బుట్టల్లో నిల్వచేసి చెత్త సేకరణ ఆటోల్లో వేయాలని సూచించారు.

జీపీ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలింపు

● అడ్డుకున్న గ్రామస్థులు



గ్రామస్థులు అడ్డుకున్న పంచాయతీ ట్రాక్టర్

కౌడిపల్లి, మే (ఆంధ్రజ్యోతి) 21: పంచాయతీ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన కొంతమందికి ఇసుక రవాణాకు పంచాయతీ కార్యదర్శి ట్రాక్టర్ ఇవ్వడమే కాకుండా పంచాయతీ కార్మికులను ఇసుక నింపేందుకు పంపించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆ ట్రాక్టర్‌ను అడ్డుకున్నట్లు తెలిపారు. గ్రామ సమస్యలను గాలికొదిలి.. అక్రమ ఇసుక రవాణాకు సహకరించిన పంచాయతీ కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థుడు బురిగారి వెంకన్నతో పలువురు కోరారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

మనోహరాబాద్ మే 21 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో రైతు వేదికలో నాలుగో విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా అదనపు డీఆర్‌డీవో రంగాచార్యులు హాజరయ్యారు. మాస్టర్లలో చాలా కొట్టివేతలు ఉన్నాయని ఫిల్డ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సంవత్సరం కాలంలో సుమారు రూ.4.38 కోట్ల ఉపాధి పనులు జరిగినట్లు గుర్తించారు. కార్యక్రమంలో డీవీఓ శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రంజిత్‌రెడ్డి, క్యూసీ జ్యోతి, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో ఆదినారాయణ, పీఆర్ఏఈ మధుసూదన్, అడవి రెంజ్ ఆఫీసర్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో రంగాచార్యులు

పుస్తకాలు వచ్చేశాయ్..

● సంగారెడ్డి జిల్లాలో 9 మండలాలకు సరఫరా

సంగారెడ్డి అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఏటా అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు మండల పాయింట్లకు చేరుకుంటున్నాయి. ఇప్పటివరకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పాఠ్యపుస్తకాల గోదామ్‌కు 85 శాతం పాఠ్యపుస్తకాలు పై నుంచి సరఫరా అయ్యాయి. దీంతో ఈ నెల 15 వ తేదీ నుంచి పాఠ్యపుస్తకాలు మండల పాయింట్లకు సరఫరా చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకు జిల్లాలోని తొమ్మిది మండలాలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేశామని అధికారులు తెలిపారు. మిగతా మండలాలకు కూడా ఈ నెలాఖరు వరకు సరఫరా చేస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.



సంగారెడ్డి మండల పాయింట్‌కు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం

● మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

● పలు మండలాల్లో టీచర్ల శిక్షణా తరగతుల పరిశీలన



అల్లాదుర్గంలో ఉపాధ్యాయుల సూచనలు చేస్తున్న డీఈవో రాధాకిషన్

పాపన్నపేట/అల్లాదుర్గం/ టేక్మాల్/పెద్దశంకరంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్న ఉద్దేశంతోనే ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం చేపట్టినట్లు మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ వెల్లడించారు. ఆయన బుధవారం పాపన్నపేట, అల్లాదుర్గం, టేక్మాల్, పెద్దశంకరంపేట మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మెదక్ జిల్లావ్యాప్తంగా 1600 మంది ఎస్జీటీలకు, 1800 మంది స్కూల్ అసిస్టెంట్లకు, ప్రధాన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఆయా మండల కేంద్రాలలో శిక్షణ నిర్వహిస్తుండగా స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆయన వెంట ఆయా మండల విద్యాధికారులు, తదితరులు ఉన్నారు.

విధిగా మొక్కలు నాటి సంరక్షించాలి

● మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్



ర్యాలీలో మున్సిపల్ అధికారులు, డ్వాక్రా మహిళలు

సంగారెడ్డి టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి భావి తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని సంగారెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, డీఈ ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమృత్ మిత్రలో భాగంగా చేపట్టిన ఉమెన్ ఫర్ ట్రీస్ (మహిళలతో మొక్కలు)పై అవగాహన కార్యక్రమాన్ని సంగారెడ్డిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ అమృత్ మిత్రలో భాగంగా రాజంపేట కాలనీలో 1500 మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. వీటి బాధ్యత డ్వాక్రా మహిళలకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఒక్కో మహిళ 50 మొక్కలు నాటి రెండేళ్ల వరకు సంరక్షించాలని అవగాహన కల్పించామని తెలిపారు. ఈ నెల 23 నుంచి 31 వరకు మొక్కలు నాటేందుకు స్థలం ఎంపిక ఉంటుందని, జూన్ 5 నుంచి ఆగస్టు 31 వరకు మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. ఎక్కువగా నీటి వనరులు చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు కిట్లు పంపిణీ చేయడంతోపాటు కాలనీలో మొక్కల పెంపకం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ సూర్య ప్రకాష్, ఏఈ రఘు, మెప్మా టిఎంసి విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

అంకిత భావంతో పనిచేయాలి

● జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. అందులో భాగంగా ఆయన ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి చాలావరకు నిరుపేదలే వస్తుంటారన్న విషయాన్ని వైద్యులు గ్రహించి మెరుగైన సేవలందించాలన్నారు. వైద్యం నిమిత్తం వచ్చిన రోగులను ఆప్యాయంగా పలుకరిస్తూ తోచిన స్థాయిలో వైద్యం చేస్తే ఆస్పత్రికి, అందులో పనిచేసే వారికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ సమస్యలను ఎవరిస్థాయిలో వారు పరిష్కరించే విధంగా కృషిచేస్తామన్నారు. వైద్యులు దేవుడితో సమానమని వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ డా.శ్రీధర్, వైద్యులు,సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు నారాగౌడ్, దా సంగమేశ్వర్, రోమాల సాయిలు ఉన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే నోటీసులు

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దృష్టి మళ్లించేందుకే నోటీసుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములకు జీవం పోసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులకు విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తుందన్నారు. కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదానిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే విచారణ'

మెదక్ మున్సిపాలిటీ, మే 21: కమీషన్ పిలుపులతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బదనాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతోందని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే విచారణల సాకుతో వేధింపులకు పాల్పడతుఉన్నారన్నారు. ఈ మూర్ఖపు చర్యలు మానుకోకపోతే బంగపాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అంజనేయులుగౌడ్, ఆర్‌కె శ్రీనివాస్, గడ్డమీది కృష్ణాగౌడ్, భీమరి కిషోర్, లింగారెడ్డి, ప్రభురెడ్డి తదితరులు ఉన్నారు.



నర్సాపూర్‌లో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు

ఘన నివాళి

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

- న్యూస్ నెట్‌వర్క్, మే 21 (ఆంధ్రజ్యోతి)



కోహీర్: దిగ్వాల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా నాయకులు



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులరిస్తున్న నీలం మధు

సాంకేతిక విప్లవానికి నాంది రాజీవ్ గాంధీ

● కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో సాంకేతికత విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీయేనని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చిట్కుల్ ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి అమోఘమన్నారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

జహీరాబాద్ డీఎస్పీగా సైదా బాధ్యతలు



బాధ్యతలను స్వీకరిస్తున్న సైదా

జహీరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ డీఎస్పీగా సైదా బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దు నేరాలపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.

తైబజారు వేలానికి దరఖాస్తులు నిల్

మెదక్ మున్సిపాలిటీ, మే 21: జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపల్ పరిధిలో తైబజారు వసూలు కోసం నిర్వహించిన వేలానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉండగా దరఖాస్తుదారులెవరూ రాకపోవడంతో నిర్వహించలేదని పేర్కొన్నారు. ఈ విషయమై మళ్లీ తేదీని ప్రకటిస్తామన్నారు.

పైలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

గుమ్మడిదల, మే (ఆంధ్రజ్యోతి) : పైలేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ మధుకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ అన్నారం గ్రామంలో పైలేరియా నిర్మూలనలో భాగంగా గురువారం(నేడు) సాయంత్రం 8 గంటల నుంచి 10 గంటల వరకూ నిద్రిస్తున్న సమయంలో 20 ఏళ్లు, ఆపై వయసు గల వారి నుంచి రక్త పూతలు తీసుకోనున్నట్లు తెలిపారు. దీనికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జిన్నారం తహసీల్దార్ బదిలీ

జిన్నారం, మే 21 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండల తహసీల్దార్ భిక్షపతి హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఆయన ఏడాదిన్నర కాలంగా పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో సంగారెడ్డి నుంచి దేవదాస్ మండల నూతన తహసీల్దారుగా బదిలీపై ఇక్కడకు రానున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగరాయి, చందాపూర్, తదితర గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏడీ మోహన్‌బాబు, దినాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి ఫీడర్ 11కే 33 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులకు అనూహ్య స్పందన

● ఆర్డీవో మహిపాల్

నర్సాపూర్, మే 21(ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోనే పైలట్ ప్రాజెక్టు కింద చిలప్‌చెడ్ మండలం ఎంపిక చేయడంతో అక్కడ భూ భారతి రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా కొనసాగుతున్నాయన్నారు. మండలంలో మొత్తం 16 గ్రామాలు ఉన్నాయని ఆయా గ్రామాలలో నిర్వహించిన సదస్సులలో 1045 వివిధ రకాల ఫిర్యాదులు అందయాన్నారు. వీటన్నింటిని నెలాఖరులోపు ఎరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

కొడుపాక సబ్ స్టేషన్ సమస్యలు పట్టవా?

● రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యుడు

పాపన్నపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలు జరిగితే గాని కొడుపాక సబ్‌స్టేషన్‌ను సమస్యలను పట్టించు కోరా అంటూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యులు శశిధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్‌స్టేషన్ నిర్మించి 25 ఏళ్ల గడిచినా ఇప్పటికీ ప్రహరీ నిర్మించలేదన్నారు. దీనికి సమీపంలోనే పాఠశాల, కొనుగోలు కేంద్రం ఉండడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారముందన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి ప్రహరీ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. మాజీ సర్పంచ్ నవీన్‌గౌడ్, వెంకటేశం, సొసైటీ మాజీ డైరెక్టర్ వెంకోబా ఉన్నారు.

అన్నదాత వరిగోస

(5వ పేజీ తరువాయి)

లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 2.45లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇందులో 43వేల టన్నుల సన్న రకం వడ్లు ఉన్నాయి.

సమస్యల తిష్ట

ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. చాలా కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేవు. లారీల కొరత వేదిస్తున్నది. సమస్యల కారణంగా ధాన్యం సేకరణ నెమ్మదిగా సాగుతున్నది. కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చిన తరువాత పదిరోజులైనా పడిగాపులు కాయాల్సి వస్తున్నాది. కొన్ని ప్రాంతాల్లో మూడు వారాలుగా వేచిచూస్తున్నా తూకం వేయడం లేదు. మరో ఐదైౖ రోజులైనా ధాన్యం సేకరణ పూర్తయ్యే పరిస్థితి కానరావడం లేదు.

అకాల వర్షాలకు ఆగమాగం

ఇప్పటికే అకాల వర్షాలతో చేనులో ఉన్న వరిపంట దెబ్బతిన్నది. ఆ తర్వాత కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రాశులు తడిసిముద్దవుతున్నాయి. పంగలంతా ఎండ కాసినా సాయంత్రం కాగానే



వెల్దుర్తిలో వర్షపునీటి ప్రవాహంలో ధాన్యం రాశులు

కురుస్తున్న అకాల వర్షాలు వణుకుపుట్టిస్తున్నాయి. 95 శాతం పంట కోయడంతోపాటు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు. కేంద్రాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబెడుతున్నారు. మరో ఇరవై రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే నెలకొన్నాయి. అప్పటికీఅప్పుడు కూడా పూర్తికాకుంటే వానలు మొదలైతే కేంద్రాల్లో ఉన్న ధాన్యానికి ముప్పు తప్పదు. అందుకే వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారమవుతుంది. లేదంటే భారీ మూల్యాన్ని చెల్లించక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం సీటు ఇజ్జత్ తీస్తున్న రేవంత్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం పరువు తీసేలా సీఎం వ్యాఖ్యలు



అప్పుపుట్టడం లేదని, తెలంగాణ అంటేనే దొంగలను చూసినట్లు చూస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలను మాజీ మంత్రిహరీశ్‌రావు ఖండించారు. రాష్ట్రం ఇజ్జత్ తీస్తున్న తీరుపై సీఎం వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. జహీరాబాద్ ప్రాంతంలో ఈ నెల 23న రేవంత్‌రెడ్డి పర్యటించడాన్ని ఆయన గుర్తు చేశారు. ఝరాసంగం మండలం మాచ్నూర్‌లో ఆరునెలల క్రితమే ప్రారంభమైన కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించడమేమిటన్నారు. ,బీఆర్ఎస్ హయాంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జిని మంజూరుచేసి పూర్తిచేయించేలా కృషిచేశాం, బసవేశ్వర విగ్రహంఏర్పాటుకు నిధులను కేటాయించామని చెప్పారు. తాము మంజూరు చేసిన వాటిని ప్రారంభించడమేంటని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జహీరాబాద్‌ప్రాంత అభివృద్ధికి కేటాయించిన నిధులను పునరుద్ధరించి ప్రారంభోత్సవాలు చేస్తే బాగుండేదన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించి ప్రారంభోత్సవాలు చేస్తే ప్రజలు సంతోషపడేవారని ఆయన చెప్పారు. వీటి ద్వారా సుమారు 3లక్షల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉందని చెప్పారు. జహీరాబాద్‌కు ఎందుకు వస్తున్నట్లు.. కొత్తగా ఏమి ఇస్తాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణ,నర్సింలు, వెంకటేశం, సంజీవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.